క్లుప్తంగా

టీడీపీ నేతల అక్రమ మైనింగ్


ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న శిరీష

సైదాపురం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు మండలంలో టీడీపీ నేతలు విచ్చలవిడిగా అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారంటూ మంగళవారం సైదాపురం ఎస్ఐ క్రాంతికుమార్‌కు రాష్ట్ర సంగీత నృత్య అకాడమీ మాజీ చైర్‌పర్సన్ పొట్టేళ్ల శిరీష ఫిర్యాదు చేశారు. అక్రమ మైనింగ్‌దారులపై కఠినమైన చర్యలు తీసుకోవాలంటూ ఆమె ఫిర్యాదులో ఆధారాలను సమర్పించారు.

అక్రమ కేసులు ఎత్తేయాలి


ఆందోళన చేస్తున్న రైతు కూలీ సంఘం నేతలు

సైదాపురం: ఊటుకూరు దళితులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసి, దళితుల భూములకు యాజమాన్య హక్కు కల్పించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కన్వీనర్ డీపీ పోలయ్య డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మూడో రోజు మంగళవారం అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరవధిక ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. రమేష్, వెంకటయ్య, మమత, కోటయ్య, అంకయ్య పాల్గొన్నారు.

104 సేవలను అందించాలి

సైదాపురం: మండలంలోని పొక్కందల గ్రామానికి 104 సేవలను అందించాలని గ్రామ ప్రజలు ఉన్నతాధికారులకు మంగళవారం విన్నవించుకున్నారు. 104 సేవలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వారు పేర్కొన్నారు. ఈవిషయమై గిద్దలూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీధర్‌ను సంప్రందించారు. స్పందించిన ఆయన ఈవిషయం తన దృష్టికి వచ్చిందని, వెంటనే ప్రతిపాదనను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఆయన వారికి తెలిపారు.

24న గ్రామసభలను నిర్వహించాలి

సైదాపురం: ఈనెల 24న 'నేషనల్ పంచాయతీ రాజ్‌డే' సందర్భంగా ప్రతి గ్రామ పంచాయతీలో ప్రత్యేక గ్రామసభలను నిర్వహించాలని ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. ప్రతి కార్యదర్శి ప్రజలకు మెరుగైన సేవలను అందించాలన్నారు.

జొన్న, నువ్వులు సాగు చేయండి


భూసార పరీక్షలు చేస్తున్న సిబ్బంది

సైదాపురం: మండలంలోని రైతులు ప్రత్యామ్నాయ పంటలపై ప్రత్యేక దృష్టి సారించాలని అలాగే జొన్న, నువ్వుల పంటలను సాగుచేసుకోవాలని ఏఓ హైమావతి కోరారు. చాగణం మర్లపూడి గ్రామాల్లో మంగళవారం భూసార పరీక్షలను నిర్వహించారు.

గరుడ వాహనంపై స్వామివారి చిద్విలాసం



సైదాపురం: మహావిష్ణువు వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహావిష్ణువు ఉత్సవమూర్తిని గరుడవాహనంపై మంగళవారం ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. కృష్ణారెడ్డిపల్లిలోని వైకుంఠపురంలో వెలసిన మహావిష్ణువు, మహాలక్ష్మీదేవి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారు గరుడ వాహనంపై పురవీధుల్లో విహరించారు. భక్తులు కర్పూరహారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు.

కోనేర్ల విలాపం

- శిథిలమవుతున్న చరిత్ర వైభవం
- శిథిలావస్థలో జాతీయ రహదారి వెంబడే ఉన్న కోనేర్లు
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం
- పునరుద్ధరిస్తే మళ్లీ పూర్వ వైభవం


పోలిరెడ్డిపాళెం రోడ్డు సమీపంలో కోనేరు దుస్థితి

దొరవారిసత్రం: వెంకటగిరి రాజుల కాలం నాటి చరిత్రకు ఆనవాళ్లుగా నిలచిన కోనేర్లు నేడు శిథిలావస్థకు చేరుతున్నాయి. చేతి బోర్లు, బావులు అందుబాటులో లేనప్పుడు ఈ కోనేర్లు పదుల సంఖ్యలోని గ్రామ ప్రజల దాహార్తి తీర్చిన ఘనత ఉంది. అంతటి ప్రాధాన్యత పొందిన కోనేర్లు క్రమేపి దెబ్బతింటూ కాలగర్భంలో కలిసిపోయేందుకు సిద్ధమవుతున్నాయి. దొరవారిసత్రం మండల పరిధిలో ఏడో నంబర్ జాతీయ రహదారి హైవే-45, 16 కిలోమీటర్లు విస్తరించి ఉంది.

రహదారి వెంబడే ఉన్న పలు గ్రామాల్లో వెంకటగిరి రాజుల కాలం నాటి కోనేర్లు ఎంతో చక్కగా బొంతరాళ్లతో నిర్మించి ఉన్నారు. వీటి నిర్వహణ కానీ, అభివృద్ధి కానీ ఎవరూ ఏళ్ల తరబడి పట్టించుకోకుండా వదిలేయడంతో కోనేర్లన్నీ ప్రస్తుతం క్రమేపి దెబ్బతింటూ వస్తున్నాయి. ఇప్పటికే ముళ్ల చెట్లతో నిండిపోయి కోనేరు నిర్మాణానికి వాడిన బొంతరాళ్లు శిథిలమై దారుణంగా దర్శనమిస్తున్నాయి. దొరవారిసత్రం, నెమిలమిట్ట అగ్రహారం, అక్కరపాక, పోలిరెడ్డిపాళెం గ్రామాల పరిధిలో ఒక్కో కోనేరు ఉంటే నెలబల్లి గ్రామ ప్రాంతంలో రహదారి వెంబడే రెండు కోనేర్లు ఉన్నాయి. ఈప్రాంతాల్లోని కోనేర్లు ముళ్ల చెట్లతో నిండిపోయినప్పటికి బొంతరాళ్లు మాత్రం చెక్కు చెదరకుండా కొన్ని కోనేర్లు ఉన్నాయి. వీటిని పునరుద్ధరించి పూర్వ వైభవం తేవాలని స్థానికులు కోరుతున్నారు.

డీవీ సత్రంలోని కోనేరు ఐదు ఎకరాల విస్తీర్ణంలో..


దొరవారిసత్రంలో ముళ్లపొదలతో నిండిన కోనేరు

అన్ని కోనేర్లు కంటే దొరవారిసత్రంలోని కోనేరు ఐదు ఎరకాల విస్తీర్ణంలో నాలుగు రేవులతో (దిగేందుకు అనువుగా) ఎంతో నైపుణ్యంతో నిర్మించారు. దీనికి పడమర భాగంలో రాణిమహల్, అదే కోనేరుకు దక్షిణ భాగంలో గుర్రాలు సేద తీర్చుకునే విధంగా గుర్రాల చావిడిని నిర్మించారు. రాణిమహల్ ఎదురుగా 15 అడుగుల ఎత్తు కలిగిన తులసి కోటను సైతం నిర్మించారు. ఇవి అన్నీ 40ఏళ్ల కిందటే శిథిలం కాగా తులసికోట మాత్రం 20ఏళ్ల కిందట శిథిలమై నేలమట్టమైంది. కోనేరు దక్షిణ భాగంలో గుర్రాలు చావిడి మాత్రం ఉంది. ఇది ఇలాఉండగా ఈమధ్య కాలంలో ఈ కోనేరు చుట్టూ అన్ని మతాల ఆలయాలు నిర్మించడం విశేషం. పడమర భాగంలో మసీదు, ఉత్తరాన చర్చి, దక్షిణాన వినాయకుడి గుడి నిర్మించడం విశేషం.

చెన్నపట్నంకు గుర్రాలపై....

వెంకటగిరి రాజుల కాలంలో అప్పటి చెన్నపట్నం (చెన్నై)కు గుర్రాలపై వెళ్లే సమయంలో తాగు నీటి సౌకర్యార్థం రహదారి వెంబడే కోనేర్లు తవ్వించినట్లు ఆ ప్రాంతం వాసులు చెపుతున్నారు. అప్పట్లో కోనేర్లు తవ్వినందునే ఈప్రాంతాల్లో గ్రామాలు వెలిసినట్లు స్థానికులు చెప్పారు. అదేవిధంగా కోనేర్లకు సమీపంలో ఉన్న గ్రామాల్లోని ప్రజలకు ఆ కాలంలో తాగు నీటి కష్టాలు సైతం ఏళ్ల తరబడి పుష్కలంగా తీరాయి. కాల క్రమేపి బావులు, చేతిబోర్లు, రిగ్ బోర్లు వంటి అందుబాటులోకి రావడంతో కోనేర్ల విషయం అందరూ మరిచిపోయారు. దీంతో రహదారి వెంబడే ఉన్న కోనేర్లు అన్ని నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుతున్నాయి.


అక్కరపాక రోడ్డు వద్ద బొంతరాళ్లు ఊడిపోయి శిథిలావస్థలో కోనేరు

పార్కులుగా తీర్చిదిద్దాలి



నెలబల్లి గ్రామ పరిధిలో జాతీయ రహదారి వెంబడే ఉన్న కోనేర్లను అభివృద్ధి చేసి పార్కులా తీర్చిదిద్దాలి. కోనేరులోని నీళ్ల కలుషితం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. దీని వల్ల భూగర్భజలాలు పెరుగుతాయి. – రామయ్య, నెలబల్లి గ్రామం

ఊటకుంటగా ఉపయోగపడతాయి



జాతీయ రహదారి వెంబడే ఉన్న కోనేర్లలో పూడికతీత పనులు చేపట్టి, పునరుద్ధరిస్తే కురిసిన వర్షం నీళ్లు అధికంగా నిలవడం వలన ఊటకుంటగా అందరికీ ఉపయోగపడతాయి.

– సుబ్బారెడ్డి, కుప్పారెడ్డిపాళెం

కోనేరును పునరుద్ధరించాలి



అక్కరపాక ప్రాంతంలో ఉన్న కోనేరును పూర్తి స్థాయిలో పునరుద్ధరించాలి. దీని వలన కోనేరులోకి పుష్కలంగా నీళ్ల చేరతాయి. ఈ కోనేరు చుట్టూ ప్రతిఏటా పలువురు రైతులు మిరపనారు వేసి బయట రైతులకు అమ్ముతారు. కోనేరులోని నీళ్ల ఎంతగానో రైతులకు ఉపయోగపడతాయి.

– కృష్ణయ్య, అక్కరపాక గ్రామం

నోటీస్ బోర్డు

విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెళ్లకూరు: మండలంలోని పెళ్లకూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉప విద్యుత్ కేంద్రంలో ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతు పనుల కారణంగా ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని సూచించారు. పెళ్లకూరు, చిల్లకూరు, జీలపాటూరు, రావులపాడు, పునబాక, నందిమాల గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు.

మండలాభిషేక పూజలు రేపు

నాయుడుపేటటౌన్: మండల పరిధిలోని తిమ్మాజికండ్రిగ గ్రామంలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి మండలాభిషేక పూజలను గురువారం ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధికసంఖ్యలో హాజరై స్వామి, అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

ప్రభుత్వ ఉద్యోగులు ఆందోళన చెందకండి

చిట్టమూరు: కోట, చిట్టమూరు, వాకాడు మండలాల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు ఆందోళన చెందకండి అని ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెంచలయ్య అన్నారు. మండల కార్యాలయ ఆవరణలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఉద్యోగస్తులకు సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యదర్శి ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

అనుబంధ సంఘాలతో పార్టీ బలోపేతం

చిల్లకూరు: అనుబంధ సంఘాల ద్వారా పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయనున్నట్లు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్ తెలిపారు. గూడూరు పట్టణంలోని సనత్‌నగర్‌లో ఆయన నివాసంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు, పార్టీ నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అనుబంధ విభాగాలతో క్షేత్రస్థాయిలో బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. గూడూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీని ప్రతి గ్రామంలో పటిష్టం చేసేలా అనుబంధ విభాగాలకు కమిటీలను ఎంపిక చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో కూటమి నేతల అరాచకాలకు అడ్డుకట్ట వేసేలా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. గూడూరు పట్టణ, రూరల్, చిట్టమూరు, కోట మండలాల కన్వీనర్లు బొమ్మిడి శ్రీనివాసులు, మల్లు విజయకుమార్‌రెడ్డి, సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి, వలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ర్యాలీ విజయవంతం చేయండి

నాయుడుపేటటౌన్: వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ నాయుడుపేటలో గురువారం నిర్వహించే శాంతియుత ర్యాలీని విజయవంతం చేసేందుకు ముస్లిం మైనారిటీలు పెద్ద ఎత్తున తరలి రావాలని ముస్లిం మత పెద్దలు పిలుపునిచ్చారు. పట్టణంలోని జామియా మసీదు ముతవల్లి హాజీ రహంతుల్లా సాహెబ్, మైలానా అబూబకర్ పలువురు మత పెద్దలు మంగళవారం సమావేశమయ్యారు. గురువారం ఉదయం 8.30 గంటలకు పట్టణంలోని జామియా మసీదు సమీపంలో ఉన్న షాది మంజిల్ నుంచి ర్యాలీని ప్రారంభించి పట్టణంలో ప్రధాన వీధుల గుండా అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందిస్తామన్నారు. ర్యాలీలో మత పెద్దలు, ముతవల్లిలు, మౌలానా, ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొనాలని మత పెద్దలు కోరారు.

పాఠశాలకు దాతల చేయూత


భోజన శాలను ప్రారంభించిన రోటరీ క్లబ్ సభ్యులు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని ప్రభుత్వ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల అభివృద్ధికి దాతలు చేయూత అందించారు. నాయుడుపేట రోటరీ క్లబ్ వారి సౌజన్యంతో అమెరికాకు చెందిన బెస్ట్ రన్నర్స్ అసోసియేషన్ రూ.1.50 లక్ష ఉన్నత పాఠశాలకు దాతృత్వంగా అందించారు. దీంతో ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థులకు భోజనశాల, వంట గదికి వాటర్ ట్యాంక్ నిర్మాణం, మరుగుదొడ్ల మరమ్మతులు చేపట్టారు. మంగళవారం రోటరీ క్లబ్ అధ్యక్షుడు పెసల జయరాజగోపాల్ వీటిని ప్రారంభించారు. పాఠశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతులను ఆయన అందజేశారు. అమెరికాకు చెందిన ప్రతినిధులు, రోటరీ క్లబ్ సభ్యులకు హెచ్ఎం సురేష్ బాబు కృతజ్ఞతలు తెలిపారు. రోటరీ క్లబ్ సెక్రటరీ రామ్మోహన్, మునగాల కృష్ణారావు, పీడీ ఉదయ్‌శంకర్, కందనూరు సంజయ్‌కుమార్, చంద్రశేఖర్, అల్లీశ్వరయ్య పాల్గొన్నారు.

మా పిల్లలు మా ఊర్లోనే..


ఎంఈఓకు వినతి పత్రం ఇస్తున్న తల్లిదండ్రులు

వాకాడు: మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొండాపురం గ్రామానికి వెళ్లి తమ పిల్లలు చదువుకోవడం కష్టతరమని, మా పిల్లలను మా ఊర్లోనే ఉంచాలని వాకాడు మండలం కాశీపురం గ్రామంలోని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం మాట్లాడుతూ కాశీపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల 3,4,5 తరగతుల విద్యార్థులను 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొండాపురం పాఠశాలకు పంపాలంటూ అధికారులు ఆదేశాలు జారీ చేయడం దుర్మార్గమన్నారు. గ్రామంలో కూలీ పనులు చేసుకునే తాము రోజూ కొండాపురం గ్రామానికి పిల్లలను తీసుకెళ్లి వదిలి పెట్టడం తమకు అసాధ్యమన్నారు. ఈ విషయమై స్థానిక ఎంఈఓ నసీంఅలీకి వినతి పత్రం సమర్పించామన్నారు. అధికారులు స్పందించి తమ పిల్లలను మా ఊర్లోనే చదువుకునేలా చూడాలని వారు కోరుతున్నారు.

దాణా పంపిణీ

చిట్టమూరు: మండలంలోని పాడి రైతులకు రాయితీపై పశువుల దాణా పంపిణీ చేస్తున్నట్లు చిట్టమూరు పశువైద్యాధికారి సురేంద్ర మంగళవారం తెలిపారు. వేసవి కావడంతో పచ్చిగడ్డి దొరక్కపోవడంతో పాల దిగుబడి తగ్గుతుందన్నారు. దీంతో మే నెల నుంచి జూన్ వరకు పాడి రైతులకు యాభైశాతం రాయితీపై దాణా అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దాణా కావల్సిన రైతులు ఆయా గ్రామాల గ్రామ సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్‌ను సంప్రదించవచ్చన్నారు. వివరాలకు 9948557727 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

మృతదేహానికి పోస్టుమార్టం

నాయుడుపేటటౌన్: మండల పరిధిలోని తిమ్మాజికండ్రిగ గ్రామం వద్ద చెరువులో పడి మృతిచెందిన పసల విజయమోహన్(34) మృతదేహానికి మంగళవారం ప్రభుత్వ వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడు పెళ్లకూరు మండలం చెంబేడు గ్రామానికి చెందిన టైలర్‌గా పోలీసులు గుర్తించిన విషయం తెలిసిందే. ఆదివారం చెరువులో స్నానానికి వెళ్లి ఊబిలో కూరుకుపోయి మృతిచెందినట్లుగా భావించారు. మృతుడి భార్య కోకిల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం జరిపి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

కండలేరులో 45.727 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం 45.727 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 330, పిన్నేరు కాలువకు 5, లోలెవల్ కాలువకు 50, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 10క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

బీమా సద్వినియోగం చేసుకోండి

సైదాపురం: ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకం కింద ఒక వ్యక్తి రూ.20 చెల్లిస్తే రెండు లక్షల ప్రమాద బీమా వస్తుందని ఎంపీడీఓ పరుషోత్తం శివకుమార్ తెలిపారు. స్థానిక సైదాపురంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఉపాధి సిబ్బందితో ఆయన సమీక్షించారు.

వీఆర్‌కు కలువాయి ఎస్ఐ

కలువాయి(సైదాపురం): విధుల్లో నిర్లక్ష్యం, పలు కారణాల నేపథ్యంలో కలువాయి ఎస్ఐ సుమన్‌ను వీఆర్‌కు బదిలీ చేస్తూ శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో ఇంకా ఎవ్వరినీ నియమించలేదు.

స్క్రీనింగ్ పరీక్షలకు స్పందన


వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

చిట్టమూరు: మండలంలోని చిల్లమూరు, ఉప్పలమర్తి గ్రామాల్లో మంగళవారం తిరుపతి స్విమ్స్ వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు విశేష స్పందన లభించింది. వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా మొబైల్ కేన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతోందని వైద్యులు తెలిపారు. పురుషులకు నోటి కేన్సర్, మహిళలకు రొమ్ము కేన్సర్ నిర్ధారణకు ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈశ్వరవాక పీహెచ్‌సీ వైద్యుడు విజయ్‌కుమార్‌రెడ్డి, స్విమ్స్ మెడికల్ ఆఫీసర్లు చైతన్య, భాను, పద్మావతి, సర్పంచులు కామిరెడ్డి కస్తూర్‌రెడ్డి, సన్నారెడ్డి విజయులురెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పోషణ్ పక్వాడపై అవగాహన


తుమ్మూరులో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ ఆశా


రాపూరులో అవగాహన కల్పిస్తున్న సునందన

నాయుడుపేటటౌన్: పోషణ్ పక్వాడపై అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు గ్రామాల్లో గర్భవతులు, బాలింతలు, చిన్న పిల్లల తల్లులకు అవగాహన కల్పిస్తూ ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టినట్లు సీడీపీఓ ఉమామహేశ్వరి వెల్లడించారు. పోషక పక్వాడ కార్యక్రమాలు ముగింపు రోజు మంగళవారం నాయుడు పేట, పెళ్లకూరు, ఓజిలి మండలాల్లో అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార విలువపై కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. సూపర్‌వైజర్లు ఆశా, మణెమ్మ పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

రాపూరు: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ సునందన అన్నారు. ఏపూరులో మంగళవారం పోషణ్ పక్వాడలో భాగంగా గర్భిణులకు వెయ్యి రోజుల సంరక్షణ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

చెత్త సంపద తయారీ కేంద్రం తనిఖీ

చిట్టమూరు: మండల పరిధిలోని ఎల్లసిరి గ్రామంలో గూడూరు డివిజన్ డీఎల్‌పీఓ వెంకటరమణ మంగళవారం చెత్త నుంచి సంపద సేకరణ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగాయన మాట్లాడుతూ తడి, పొడి చెత్త వేరు చేసి తమ ఇంటికి వచ్చిన చెత్తబండ్లలో వేయాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కేంద్రంలో వర్మీకం పోస్ట్ ఎరువు తయారు చేసి రైతులకు అందజేస్తామన్నారు. సీఆర్పీ రవి, పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి పాల్గొన్నారు.

భూ సేకరణ త్వరితగతిన పూర్తిచేయాలి


మాట్లాడుతున్న జేసీ శుభం బన్సల్

నాయుడుపేట టౌన్: వైజాగ్- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ రహదారి నిర్మాణ పనులకు సంబంధించి భూసేకరణపై ఎక్కడా సమస్యలు రాకుండా చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ అధికారులకు సూచించారు. మండల పరిధిలోని పండ్లూరు గ్రామ జాతీయ రహదారి వద్ద మంగళవారం ఆర్డీఓ కే.కిరణ్మయితో పాటు తహసీల్దారు మాగర్ల రాజేంద్ర, సర్వేయర్లతో మాట్లాడారు. భూసేకరణ విషయాలపై ఆరా తీశారు. వైజాగ్- చెన్నై పారిశ్రామిక ప్రాంత అభివృద్ధిలో భాగంగా ఏడీబీ వారి(ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్) ఆర్థిక సహాయంతో రహదారి విస్తరణ జరుగుతుందన్నారు. ఇందుకుగాను నాయుడుపేట, ఓజిలి మండలాల్లో వచ్చే పలు గ్రామాల్లో పూర్తి స్థాయిలో భూ సేకరణ చేపట్టాలని జేసీ సూచించారు. నాయుడుపేట మండలంలో తిమ్మాజీ కండ్రిగ, అయ్యప్పరెడ్డిపాళెం, వెంగమాంబపురం, పండ్లూరు, లక్ష్మీపురం గ్రామాలు, ఓజిలి మండల పరిధిలోని గ్రద్దగుంట, పున్నేపల్లి, కొత్తపేట, పాపారెడ్డికండ్రిగ గ్రామాల్లో సుమారు 68 ఎకరాలకు పైగా భూ సేకరణ చేస్తున్నట్లు జేసీ తెలిపారు. కొన్ని చోట్ల ఇళ్లు కూడా కోల్పోవాల్సి వస్తుందన్నారు. భూములు, ఇళ్లు కోల్పోయే బాధితులకు నష్టపరిహారం చెల్లిస్తామని చెప్పారు.

ఉద్యోగ విరమణ సన్మానం


దినకర్ దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

చిట్టమూరు: స్థానిక జెడ్పీ హైస్కూల్లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వేము దినకర్ ఉద్యోగ విరమణ వీడ్కోలు సన్మాన సభను మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. దినకర్ దంపతులను ఘనంగా సత్కరించారు. ఎంఈఓ-2 వెంకటేశ్వరప్రసాద్, హెచ్ఎం మీనాకుమారి, ఉపాధ్యాయులు భరత్ మహీపతి, సుభాషిణి, దినకర్ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

సర్వీసు రోడ్ల సమస్యపై వినతి


ఎన్‌హెచ్ పీడీకి వినతి పత్రం ఇస్తున్న నేతలు

నాయుడుపేటటౌన్: సాగరమాల జాతీయ రహదారి నిర్మాణ పనుల వద్ద రైతుల పొలాలకు సర్వీసు రోడ్లు లేకుండా చేస్తున్న విషయమై మంగళవారం రైతు సంఘ నాయకులు నెల్లూరు నేషనల్ హైవే పీడీ ఎంకే.చౌదరికి వినతి పత్రం అందజేశారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు సాగరమాల రహదారి నిర్మాణ పనుల వద్ద ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేలా చూడాలని రైతులు కోరారు. నేతలు జలదంకి వెంకటకృష్ణారెడ్డి, సన్నారెడ్డి హరినాథ్‌రెడ్డి, వాకాటి సుధాకర్‌రెడ్డి, జలదంకి మదన్‌మోహన్‌రెడ్డి, తంబిరెడ్డి సురేష్‌రెడ్డి, చమతా రాజేష్ పాల్గొన్నారు.